

కూర్మ విలాపం
తాబేళ్ల అక్రమ రవాణాకు కొల్లేరు ప్రాంతం కేంద్రంగా మారింది. నల్లచిప్ప తాబేళ్లను కొందరు సరిహద్దులు దాటించేస్తున్నారు.
8లో



దోమ తెరలు ఎక్కడ?
జిల్లాలోని మన్య ప్రాంతంలో మలేరియా జ్వరాలు విజృంభిస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదని గిరిజన సంఘాలు విమర్శిస్తున్నాయి.
8లో



పశువుల్లో ఈనిక సమస్యలు
ఆవులు, గేదెల్లో ఈనిక సమస్యలను ముందుగా గుర్తించడం, నివారించడం ద్వారా పశువుల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.
8లో

న్యూస్‌రీల్

13న మాజీ సీఎం జగన్ రాక



హెలీప్యాడ్‌ను పరిశీలిస్తున్న మండలి చైర్మన్ మోషేన్‌రాజు, నాయకులు

భీమవరం : ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు కుమార్తె వివాహ వేడుకకు ఈనెల 13న మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భీమవరం రానున్నారు. ఆదివారం హెలీప్యాడ్ ప్రాంతాన్ని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు పరిశీలించారు. భీమవరం శివారు వీఎస్ఎస్ గార్డెన్స్‌లో వివాహ వేడుక జరుగనున్నందున సమీపంలో హెలీప్యాడ్ ఏర్పాటుకు అనుకూల పరిస్థితులను పరిశీలించారు. ఆయన వెంట వాసుబాబు, వైఎస్సార్‌సీపీ భీమవరం నియోజకవర్గ సమన్వయకర్త చినమిల్లి వెంకటరాయుడు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, భీమవరం పట్టణ అధ్యక్షుడు గాదిరాజు రామరాజు తదితరులు ఉన్నారు.

టోల్‌గేట్ క్రాంటాక్టర్‌కు నోటీసులు

సాక్షి ఎఫెక్ట్

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల శ్రీవారి కొండపైన టోల్‌గేట్ నిర్వహిస్తున్న కాంట్రాక్టర్‌కు దేవస్థానం ఈఓ ఎన్‌వీ సత్యనారాయణమూర్తి ఆదివారం నోటీసు జారీ చేశారు. బైక్‌లు, మోపెడ్‌లకు రూ.10ల రుసుం వసూలు చేయాల్సి ఉండగా రూ.20లు వసూలు చేస్తున్నారు. దీనిపై ఆదివారం 'సాక్షి'లో 'శ్రీవారి కొండపై టోల్ బాదుడు' శీర్షికన కథనం ప్రచురించగా ఈఓ స్పందించారు. మూడు రోజుల్లోపు సంజాయిషీ ఇవ్వాలని కాంట్రాక్టర్‌కు నోటీసు ఇచ్చారు.

16న ప్రైవేట్ పాఠశాలల సమస్యలపై చర్చ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): చీరాలలో ఈనెల 16న జరిగే అపుస్మా (ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్) రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సమస్యలపై చర్చిస్తామని అపుస్మా రాష్ట్ర అధ్యక్షుడు కె.తులసీ ప్రసాద్ తెలిపారు. ఆదివారం స్థానిక శ్రీశ్రీ పాఠశాలలో నిర్వహించిన జిల్లా కార్యనిర్వాహక కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం అడ్మిషన్ పొందిన వారికి ప్రభుత్వం కొత్త బ్యాంకు ఖాతాలు ఓపెన్ చేసుకోమనడం సరికాదన్నారు. స్టార్ రేటింగ్ ప్రకారం కేవలం రూ.8 వేలు ఫీజులుగా ఇస్తామంటున్నారని, తల్లికి వందనం ఉచిత విద్యలో భాగమే కాబట్టి విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రవేశాలు పొందిన వారికి కనీసం రూ.13 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎంటీఎస్ శర్మ మాట్లాడుతూ యాప్‌లు, బోధనేతర పనులను ఉపాధ్యాయులకు కేటాయించడం, ట్రాన్స్‌పోర్ట్, గ్రీన్ టాక్స్ వంటి సమస్యలపై చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు.

ఆటో డ్రైవర్ల ఆక్రందన



ఉచిత బస్సుపై నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు (ఫైల్)



ఆటో.. భవిత ఎటో
- ఉచిత బస్సుతో ఉపాధికి ముప్పు
- ఫైనాన్స్‌లపై 90 శాతానికి పైగా ఆటోల కొనుగోలు
- నెలనెలా వాయిదాలతో ఇప్పటికే ఇబ్బందులు
- ప్రత్యామ్నాయ ఉపాధికి డ్రైవర్ల డిమాండ్
- కూటమి ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయంతో కష్టకాలం
- ఉమ్మడి జిల్లాలో 40 వేల మంది డ్రైవర్లు

భీమవరం(ప్రకాశం చౌక్): కూటమి ప్రభుత్వం అమలు చేయనున్న ఉచిత బస్సు (స్త్రీ శక్తి) పథకంతో తాము ఉపాధి కోల్పోతామంటూ ఆటో డ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు. అప్పులు చేసి, ఫైనాన్స్‌లపై ఆటోలు కొనుగోలు చేసి జీవనం సాగిస్తున్నామని, ఉచిత బస్సుతో ప్రయాణికులు లేక, ఆటోలు నడవక తాము బతికేదెలా అంటూ ఆవేదన చెందుతున్నారు. తమకు ప్రత్యామ్నాయ ఉపాధి, ఆర్థిక సాయంపై మాట్లాడకుండా ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం తగదని అంటున్నారు. ఉచిత బస్సు పథకంతో ఆటో డ్రైవర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారనుంది. ఉమ్మడి పశ్చిమలో 20 నుంచి 60 ఏళ్ల వయసున్న సుమారు 47 వేల మంది కార్మికులు ఆటోలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. తమ పొట్ట కొట్టడానికి ఈ పథకాన్ని తీసుకువచ్చారని వీరు మండిపడుతున్నారు. ఇప్పటికే ఉచిత బస్సుపై పలు రూపాల్లో ఆందోళనలు తెలుపుతున్నారు.

ఫైనాన్స్‌లో కొనుగోలు

జిల్లాలో నడుస్తున్న 90 శాతం ఆటోలను డ్రైవర్లు ఫైనాన్స్‌లో కొనుగోలు చేశారు. ఆటో ధర రూ.4 లక్షల వరకు ఉండగా.. నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేలకు వాయిదా కడుతున్నారు. అలాగే నెలకు ఆటో నిర్వహణకు రూ.2 వేలు, మరమ్మతులకు రూ.3 వేలు మొత్తంగా రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చవుతుంది. వీటితో పాటు రవాణా శాఖ అధికారుల కేసులు, ఏడాదికి బ్రేక్, ఫిట్‌నెస్ కోసం ఖర్చులు అదనం. ఈ పరిస్థితుల్లో రోజుకు డీజిల్ ఖర్చులు కాకుండా వీటి కోసమే రూ.800కు పైగా వెచ్చించాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో ఉచిత బస్సుతో ప్రయాణికులు లేక ఆటోలు నడవకపోతే జీవనం ఎలా సాగుతుందని డ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు. అప్పులు తీర్చలేక ఆత్మహత్యలే శరణ్యమని వాపోతున్నారు.

40 వేల ఆటోలు.. 47 వేల మంది కార్మికులు

ఉమ్మడి పశ్చిమలో సుమారు 40 వేల ఆటోలు ఉన్నాయి. ఏలూరు జిల్లాలో 24 వేలు, పశ్చిమగోదావరి జిల్లాలో 16 వేల వరకు ఆటోలు ఉండగా మొత్తంగా 40 వేల ఆటో డ్రైవర్ల కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. వీరితో పాటు ఆటో మెకానిక్, సీటు వర్క్, స్పేర్ పార్ట్స్ విక్రయదారుల కుటుంబాలు మరో 7 వేల వరకు ఉంటాయి. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు తీసుకురావడం ద్వారా ఆటోలు నడపటం కష్టం కాగా ఉపాధి లేక సుమారు 47 వేల కుటుంబాలకు ఇబ్బందులు తలెత్తవచ్చు.

కూటమి ఏకపక్ష నిర్ణయం

తమ ఉపాధిని దెబ్బతీసేలా ఉచిత బస్సు పథకం అమలుపై కూటమి ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయం తీసుకుందని ఆటో యూనియన్ నాయకులు ఆందోళన చెందుతున్నారు. ఆటో యూనియన్లతో కనీసం చర్చించలేదని అంటున్నారు. ఆటోల ద్వారా ప్రభుత్వానికి పలురకాలుగా ఆదాయం వస్తుందని చెబుతున్నారు. డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి, ఆర్థిక సాయం వంటి వాటిపై మాట్లాడకపోవడం దారుణమని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో తమను ఆదుకోవాలని కోరుతూ జిల్లాలోని ఆటో కార్మికులు మంగళవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందించడానికి సన్నద్ధమవుతున్నారు.

మాకు న్యాయం చేయాలి



ఇప్పటికే ఆటోలు పెరిగి డ్రైవర్లకు ఉపాధి అంతంతమాత్రంగా ఉంది. ఉచిత బస్సుతో పూర్తిగా ఉపాధి కోల్పోయి ఆటోలను ఫైనాన్స్ కంపెనీలకు అప్పగించాల్సిందే. డ్రైవర్లంతా ఆటోలు వదిలి కూలీ పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకోవాలి. ఆటో డ్రైవర్ల కుటుంబాలకు న్యాయం జరిగేలా చూడాలి.
– డి.నరేష్, ఆటోడ్రైవర్, పాలమూరు

చాలా ఆందోళనగా ఉంది



ఉచిత బస్సుపై చాలా ఆందోళన చెందుతున్నాం. ఆటోలు ఎక్కేవారి సంఖ్య బాగా తగ్గిపోతుంది. ట్రిప్పులు లేక, ఆదాయం లేక కుటుంబాలను ఎలా పోషించుకోవాలో అర్థం కావడం లేదు. మాకు ప్రత్యామ్నాయ ఉపాధి లేదా మరేదైనా ఆదాయ మార్గం చూపించిన తర్వాత కూటమి ప్రభుత్వం ఉచిత బస్సు పథకాన్ని అమలు చేయాలని కోరుతున్నాం.
– పి.జగన్, ఆటోడ్రైవర్, భీమవరం

ప్రత్యామ్నాయం చూపాలి



ఉచిత బస్సుకు మేం వ్యతిరేకం కాదు గానీ ఆటో కార్మికుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని యూనియన్లతో చర్చించాల్సింది. ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలి. ఆటో కార్మికులను ఆదుకునేలా ప్రకటన చేయాలి. నెలనెలా ఆటో కార్మికులకు భృతి ఇవ్వాలి. చాలా మంది అప్పులు చేసి ఆటోలు కొన్నారు. వారందరినీ ఆదుకోవాలి.
– ఇంటి సత్యనారాయణ, జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షుడు

ఉపాధికి ఇబ్బందులు



ఉచిత బస్సుతో ఆటో డ్రైవర్లకు ఇబ్బందులు తప్పవు. ఆటోలకు ఫైనాన్స్‌లు కట్టలేక, కుటుంబాలను పోషించుకోలేక అవస్థలు పడాల్సిన పరిస్థితి. కూటమి ప్రభుత్వం ఆటో కార్మికుల కష్టాలు గురించి ఆలోచన చేసి మాకు మేలు జరిగేలా నిర్ణయం తీసుకోవాలి తప్ప ఏకపక్షంగా ఉచిత బస్సు పథకాన్ని అమలుచేయడం తగదు.
– సీహెచ్ రామకృష్ణ, ఆటోడ్రైవర్, వేండ్ర

మహిళా ప్రయాణికులే ఎక్కువ



ఆటోలో 90 శాతం మహిళలే ప్రయాణిస్తారు. వారి ద్వారానే మేం ఉపాధి పొందుతున్నాం. ఇప్పుడు ఉచిత బస్సుతో ఆటోలు ఎక్కేవారు తగ్గిపోతే మా పరిస్థితి ఏంటి. కూలీ పనులకు, ఆక్వా పరిశ్రమలకు మహిళలను తీసుకువెళుతూ ఉపాధి పొందుతున్నా. ఉచిత బస్సుతో అప్పుల ఊబిలో కూరుకుపోవడం ఖాయం.
– పి.గోపి, ఆటోడ్రైవర్, భీమవరం

సీసీ కెమెరా ఏర్పాటుపై మండిపాటు



పాములపర్రులో నిరసన తెలుపుతున్న దళితులు

ఉండి: మేమేమైనా నేరస్తులమా? లేక తీవ్రవాదులమా.. మా ప్రాంతంలో పోలీసులు సీసీ కెమెరా ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని పాములపర్రులో దళితులు ఆదివారం నిరసన తెలిపారు. ఇప్పటికే దళితపేట వద్ద పోలీసులు పహారా కాస్తూ తమ స్వేచ్ఛను హరిస్తున్నారని, ఇప్పుడే ఏకంగా సీసీ కెమెరా ఏర్పాటు చేశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. శాంతి భద్రతల కోసం అయితే గ్రామంలోని సెంటర్‌లో కెమెరాలు పెట్టాలని, దళితులను కించపరిచేలా ఇక్కడ ఏర్పాటుచేయడం ఏంటని ప్రశ్నించారు. అంతేకాకుండా సీసీ కెమెరా ఓ ప్రైవేట్ వ్యక్తి పోలీసులకు ఇచ్చారని, అతడి మనుషులే పాములపర్రుకు తెచ్చారని వార్డు సభ్యుడు దర్శి సాల్మన్‌రాజు, దళిత యువకులు మామిడిపల్లి ఏసేబు, దర్శి పరదేశి, తేలి మహేష్,శ్రీనివాస్, ఊబా రమేష్ ఆరోపించారు. దీనిపై ఎస్సై ఎండీ నసీరుల్లాను వివరణ కోరగా సీసీ కెమెరాను తామే ఏర్పాటు చేశామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైనా అల్లర్లకు పాల్పడినా, లేదా రెచ్చగొట్టేందుకు ప్రయత్నించినా, ఇతర ప్రాంతాల వారు వచ్చి ఇబ్బందులు తలెత్తేలా వ్యవహరించినా ముందు జాగ్రత్త చర్యలు తీసుకునేందుకే కెమెరా ఏర్పాటు చేశామన్నారు.

పారిజాతగిరి ధర్మకర్తల మండలికి నోటిఫికేషన్

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలోని గోకుల తిరుమల పారిజాతగిరి ధర్మకర్తల పాలక మండలి నోటిఫికేషన్‌ను దేవదాయ శాఖ విడుదల చేసినట్టు ఈఓ కలగర శ్రీనివాస్ తెలిపారు. ఆసక్తిగల వారు ఈనెల 26వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, దరఖాస్తులను ఏలూరు జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో సమర్పించాలని ప్రకటనలో తెలిపారు.

పవిత్రోత్సవం.. పరిపూర్ణం



మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: చినవెంకన్న ఆలయంలో నాలుగు రోజులపాటు జరిగిన శ్రీవారి దివ్య పవిత్రోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఉదయం ఆలయంలో పవిత్రావరోహణ, శ్రీ మహా పూర్ణాహుతి హోమం అనంతరం మహదాశీర్వచనాన్ని అర్చకులు, పండితులు వైభవంగా నిర్వహించారు. శ్రీవారి ములవిరాట్, పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లు, ఉత్సవమూర్తులపై ఉంచిన దివ్య పవిత్రాలను అర్చకులు వేద మంత్రోచ్ఛరణల నడుమ తొలగించారు. అనంతరం వివిధ దినుసులతో మహాపూర్ణాహుతి హోమాన్ని జరిపించారు. పవిత్రోత్సవాలను పురస్కరించుకుని నాలుగు రోజులుగా ఆలయంలో నిలిపివేసిన నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలను సోమవారం నుంచి పునరుద్ధరిస్తామని ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణమూర్తి తెలిపారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి

మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తణుకు అర్బన్: రాష్ట్రవ్యాప్తంగా శాంతిభద్రతలు క్షీణించాయని, పోలీసు యంత్రాంగం పూర్తిస్థాయిలో రెడ్‌బుక్‌ను అమలుచేసే పనిలో ఉన్నారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు మండిపడ్డారు. తణుకులోని ఆయన నివాసంలో ఆదివారం పార్టీ శ్రేణులతో సమావేశమై మాట్లాడారు. కూటమి నాయకులు తమకు వ్యతిరేకంగా ఉన్న ప్రాంతాల్లో రౌడీయిజం చేయిస్తూ ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, ఇప్పుడు పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికల్లో భాగంగా ఏకంగా వందలాది మంది పచ్చ గూండాలు బీసీ వర్గీయులపై దాడికి దిగడం, పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడం దుర్మార్గమన్నారు. చంద్రబాబు ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ ఖాకీలు తప్పులమీద తప్పులు చేసుకుంటూ పోతున్నారని, ఒక పక్క న్యాయస్థానాలు తప్పుపడుతున్నా వీరి తీరు మారడం లేదని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ నేతలపై ఐటీడీపీ సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెడుతున్నారని ఫిర్యాదులు చేస్తున్నా పోలీసులు పట్టించుకోకపోగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను టార్గెట్ చేసి వేధిస్తున్నారని అన్నారు. రోజులు ఎప్పుడూ ఒకలానే ఉండవని, మీరు చూపిస్తున్న మార్గం ఎదుటివారికి కూడా కనిపిస్తుందనే విషయాన్ని మరచిపోవద్దని కారుమూరి హెచ్చరించారు.

ఇది వంచన ప్రభుత్వం

నా రాజకీయ జీవితంలో ఇంతటి అరాచకం, అఘాయిత్యాలు, మోసం, దాడులు, వంచన చేసిన ప్రభుత్వాన్ని ఎన్నడూ చూడలేదని, మొదటిసారి ఇప్పుడే చూస్తున్నానని కారుమూరి అన్నారు. కూటమి ప్రభుత్వం తన పొరపాట్లను కప్పిపుచ్చుకునేందుకు, ప్రజల దృష్టి మార్చేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై, నాయకులపై బురద జల్లే ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం 13 నెలల కాలంలో సుమారు రూ.2 లక్షల కోట్లు అప్పులు చేసిందని, దీంతో ప్రజలకు ఏం మంచి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ ఎప్పుడు అమలుచేస్తారని ప్రజలే ప్రశ్నిస్తున్నారని కారుమూరి నాగేశ్వరరావు అన్నారు.

అయ్యవార్లపై మూల్యాంకన భారం

గురువులకే పరీక్ష !
- ప్రభుత్వ ఉపాధ్యాయులకు బోధనేతర పనులు
- ప్రతి తరగతి, సబ్జెక్టుకు మూల్యాంకన పుస్తకాల పంపిణీ
- ఆ పుస్తకాల స్కానింగ్‌తో సమయం వృథా
- నేటి నుంచి ఎఫ్ఏ–1 పరీక్షలు
- ఉపాధ్యాయ సంఘాల నేతల ఆందోళన



పాఠశాలలకు అందించిన మూల్యాంకన పుస్తకాలు

నిడమర్రు: కూటమి ప్రభుత్వం సంస్కరణల పేరుతో విద్యావ్యవస్థలో తీసుకువస్తున్న పరీక్షల విధానాన్ని చూసి ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా సోమవారం నుంచి జరిగే సెల్ఫ్ అసెస్‌మెంట్ (ఎఫ్ఏ–1) పరీక్షలు అటు విద్యార్థికి, ఇటు ఉపాధ్యాయులకు పరీక్షే అంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాఠశాలలకు అందించిన మూల్యాంకన పుస్తకాలతో మరో బోధనేతర పనికి సిద్ధమవ్వాలని ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారు.

పొందుపరిచి.. స్కాన్ చేసి..

ఈ విద్యా సంవత్సరంలో నిర్వహించే ఎఫ్ఏ, ఎస్ఏ పరీక్షల మొత్తం సమాచారాన్ని విద్యాశాఖ అందించిన మూల్యాంకన పుస్తకంలో ఉపాధ్యాయులు పొందుపరచాలి. అలాగే విద్యార్థుల సామర్థ్యాలకు సంబంధించిన 15 మార్కుల అంశాలను ఉపాధ్యాయుడే స్వయంగా నమోదుచేయాలి. ఆయా సబ్జెక్టుల్లో ఆయా సామర్థ్యంలో ఎందుకు మార్కులు తక్కువ వచ్చాయి.. ఎక్కువ వస్తే ఎలా గుర్తించావు.. అనే విషయం వివరంగా రాయల్సి ఉంటుంది. అనంతరం వాటిని స్కాన్ చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఇప్పటికే పెరుగుతున్న బోధనేతర పనులకు తరగతికి దూరమవుతున్న ఉపాధ్యాయులు ప్రభుత్వం తాజాగా మూల్యాంకన భారం మోపడంపై తలలు పట్టుకుంటున్నారు.

శిక్షణ లేదు.. స్పష్టత లేదు

మూల్యాంకనంలో మార్పులపై ఉపాధ్యాయులకు ఎలాంటి శిక్షణ ఇవ్వకుండా ఎఫ్ఏ–1 పరీక్షలకు విద్యాశాఖ సిద్ధం చేసింది. దీంతో వాట్సాప్‌లో వస్తున్న సమాచారం ఆధారంగానే పరీక్షలు నిర్వహించేందుకు ఉపాధ్యాయులు సిద్ధమవుతున్నారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఈనెల 4 నుంచి ఎఫ్ఏ–1 పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా మూల్యాంకన పుస్తకాలు మండలాలకు అందకపోవడంతో వాయిదా వేశారు. అయితే ఈ పుస్తకాలను ఎలా నిర్వహించాలి, ఏఏ అంశాలు పూరించాలనే విషయాలపై కేవలం వాట్సాప్‌లో వస్తున్న మెసేజ్‌లే తప్ప ఏ అధికారి సమగ్రంగా వివరించే అవకాశం లేకుండానే పరీక్షలు ప్రారంభించడాన్ని ఉపాధ్యాయులు తప్పుపడుతున్నారు.

ఉరుకులు.. పరుగులు

మూల్యాంకన పుస్తకాలు ఆటోలో తెచ్చుకోవడం, బ్యాలెన్స్ పుస్తకాల కోసం ఎంఈఓ కార్యాలయాల చుట్టూ తిరగడం, మూల్యాంకన పుస్తకాల్లో విద్యార్థుల ప్రతిస్పందనలు రాయడం ఒక ఎత్తయితే.. విద్యార్థులతో ఓఎంఆర్ షీట్‌లో జవాబులు రాయించడం మరో ఎత్తు. 1వ తరగతి విద్యార్థి కూడా ఓఎంఆర్ షీట్స్‌లోనే పరీక్షలు రాయడం ఆ ఉపాధ్యాయులకు పరీక్షే. అలాగే మొత్తం అంశాలు, ఓఎంఆర్ షీట్స్‌ను స్కాన్ చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయడం, ఆన్‌లైన్‌లో మార్కులు నమోదు చేయడం వంటి పనులకే సమయం సరిపోతుందని టీచర్లు ఆవేదన చెందుతున్నారు.

బోధనేతర భారం పెరిగి..



మూల్యాంకన పుస్తకాలతో ఉపాధ్యాయులకు బోధనేతర భారం మరింత పెరుగుతుంది. విద్యార్థి ప్రతిస్పందనలతో పాటు ఓఎంఆర్ షీట్‌లో కోడ్లు, అపార్ ఐడీలు, పెన్ ఐడీలను తప్పులు లేకుండా రాసేలా చూడటం, జవాబులను దిద్దిన తర్వాత స్కోరింగ్ ఇవ్వడం, దీనికి వివరణ రాయడంతో పాటు పేజీలన్నింటినీ స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలి. వీటి కోసం అవుట్ సోర్సింగ్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్స్‌ను నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.
– లంకలపల్లి సాయిశ్రీనివాస్, స్టేట్ ఫ్యాప్టో చైర్మన్

సమయం హరిస్తుంది



సంస్కరణలు విద్యార్థులకు మేలు చేయాలే తప్ప కీడు కాదు. మూల్యాంకన పుస్తకం విధానంతో ఉపాధ్యాయులకు అదనపు భారం తప్ప విద్యార్థులకు ప్రయోజనం కనిపించడం లేదు. కొత్త విధానంలో తరగతి గదిలోనే విద్యార్థుల ప్రతిస్పందనలు పరిశీలించి మూల్యాంకన పుస్తకంలో నమోదు చేయాల్సి ఉంటుంది. ఉన్నత పాఠశాలల్లో పదుల సంఖ్యలో విద్యార్థులు ఉంటారు. దీంతో బోధనా కాలం హరిస్తుంది. దీంతో విద్యా ప్రమాణాలు తగ్గే ప్రమాదముంది.
– బొర్రా గోపీ మూర్తి, టీచర్స్ ఎమ్మెల్సీ

క్లుప్తంగా

గుబ్బల మంగమ్మతల్లి గుడికి పోటెత్తిన భక్తులు


గుబ్బల మంగమ్మ దర్శనానికి వచ్చిన భక్తులు

బుట్టాయగూడెం: కాపవరం సమీపంలోని అటవీప్రాంతంలో కొలువై ఉన్న గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు విజయవాడ, మచిలీపట్నం, తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం, సత్తుపల్లి, అశ్వారావుపేట ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు వాహనాలతో తరలివచ్చి అమ్మవారికి దూపదీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు


సుబ్బారాయుడిని దర్శించుకుంటున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. స్వామివారి పుట్టలో పాలు పోసి స్వామివారిని దర్శించుకున్నారు. పాలపొంగళ్ల శాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు. నాగబంధాల వద్ద స్వామివారి మూర్తులను ప్రతిష్ఠించేందుకు అర్చకులతో పూజలు చేయించి ప్రతిష్ఠ తంతు నిర్వహించారు. నాగబంధాల వద్ద, గోకులంలోని గోవులకు మహిళలు పసుపుకుంకుమలతో పూజలు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అన్నప్రసాద ఏర్పాట్లు చేశారు.

మద్దిలో హనుమద్ హోమం


హనుమద్ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయ స్వామి దేవస్థానంలో హనుమద్ హోమం ఆలయ అర్చకులు, వేద పండితులు ఆద్వర్యంలో వైభవంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈవో ఆర్వీ చందన మాట్లాడుతూ స్వామి వారి సన్నిధిలో ఈ హోమం ప్రతీ ఆదివారం భక్తులకు ఆర్జిత సేవగా దేవస్థానం నిర్ణయించిందన్నారు. హోమ కార్యక్రమం పర్యవేక్షణ ఆలయ పర్యవేక్షకుడు జవ్వాది కృష్ణ నిర్వహిస్తారని ఈవో తెలిపారు.

పెద్దింట్లమ్మ దేవస్థానంలో భక్తుల రద్దీ


దేవస్థానంలో దర్శనానికి వచ్చిన భక్తులు

కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మను సమీప జిల్లాల నుంచి భక్తులు ఆదివారం దర్శించుకున్నారు. దేవస్థానం సమీప పవిత్ర కోనేరులో స్నానాలు ఆచరించిన భక్తులు అమ్మకు వేడి నైవేద్యాలు, పొంగళ్లు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పేటేటి పరమేశ్వరశర్మ పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ మాట్లాడుతూ ఒక్క ఆదివారం రోజున మొత్తం రూ.38,9085 ఆదాయం వచ్చిందని చెప్పారు.

కూర్మ విలాపం

- కొల్లేరు చుట్టూ తాబేళ్ల అక్రమ రవాణా
- అంతరించిపోతున్న నల్లచిప్ప తాబేళ్లు
- గుట్టుచప్పుడు కాకుండా ఒడిశాకు తరలింపు


పట్టుబడిన తాబేళ్లను పక్షుల కేంద్రంలో వదులుతున్న దృశ్యం(ఫైల్)

కైకలూరు: తాబేళ్ల అక్రమ రవాణాకు కొల్లేరు ప్రాంతం కేంద్రంగా మారింది. పర్యావరణానికి వెలకట్టలేని మేలు చేస్తున్న నల్లచిప్ప తాబేళ్లను కాసులకు కక్కుర్తిపడి రాత్రి సమయంలో సరహద్దులు దాటించేస్తున్నారు. ఒడిశా రాష్ట్రంలో తాబేలు మాంసానికి మంచి గిరాకీ ఉండటంతో అడ్డదారుల్లో గుట్టు చప్పుడు కాకుండా తరలించి అక్రమార్కులు జేబులు నింపుకుంటున్నారు. తాబేళ్ల స్మగ్లర్ కుమార్ రెండేళ్లుగా ఒడిశాలో ఉంటూ కొల్లేరు ప్రాంతం నుంచి వచ్చే తాబేళ్లను మార్కెట్ చేస్తున్నాడు. అతనిపై తాబేళ్ల అక్రమ రవాణాలో పలు కేసులున్నాయి.

అక్రమ రవాణా ఇలా..

ఉమ్మడి జిల్లాలో చేపలు 1.80 లక్షలు, రొయ్యలు 1.10 లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. చేపల పట్టుబడుల వలలో తాబేళ్లు చిక్కుకుంటాయి. వలల మేస్త్రీ సమాచారంతో కొందరు వీటిని సేకరిస్తున్నారు. ఎక్కువ మంది కొల్లేరు డ్రెయిన్లు, పంట బోదెలలో వీటిని పట్టుకుంటున్నారు. ఏజంట్లు సేకరించిన తాబేళ్ళను గోనె సంచులు, నీటి డ్రమ్ములలో దాస్తున్నారు. సేకరించిన వీటిని సైజును బట్టి కేజీ రూ.30 నుంచి రూ.40 వరకు ఇక్కడ కొనుగోలు చేసి ఒడిశాలో కేజీ రూ.300పైగా విక్రయిస్తోన్నారు. ఉదాహరణకు వాహనంలో సుమారు 5 టన్నుల తాబేళ్లు రవాణా చేస్తే రూ.15 లక్షలు ముడుతోంది. అన్ని ఖర్చులు పోయి అక్రమార్కులకు మినిమం రూ.10 లక్షల వరకు మిగులుతోంది. దీంతో అక్రమ మార్గాన్ని ఎంచుకుంటున్నారు.

కేంద్ర బిందువుగా భీమవరం

ఆక్వా హబ్‌గా పేరొందిన భీమవరం అక్రమ తాబేళ్లకు స్టాకింగ్ పాయింట్‌గా మారింది. కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాల్లో సేకరించిన తాబేళ్లను కోరుకొల్లు, కలిదిండి, కాళ్ళ మీదుగా భీమవరం తరలిస్తున్నారు. అక్కడ నుంచి పెద్ద వాహనాల్లో ఒడిశా చేర్చుతున్నారు. కొల్లేరు ప్రాంతం నుంచి బొలేరో వాహనాల్లో అడుగున తాబేళ్లను పరిచి పైన చేప గురక పిల్లలను ఉంచుతున్నారు. ఎవరైన చెకింగ్‌కు వస్తే చేపలు కనిపిస్తాయి. అడుగున తాబేళ్లను గుర్తించలేకపోతున్నారు. మండవల్లి మండలం కొవ్వాడలంక, కలిదిండి మండలం బొబ్బిలిగూడెంకు చెందిన ఇద్దరు గతంలో తాబేళ్ళ రవాణాలో కీలకంగా వ్యవహరించారు. నియోజకవర్గంలో కలిదిండి, వెంకటాపురం, ఏలూరు రోడ్, ముదినేపల్లి ప్రాంతాల్లో అటవీ, పోలీసు అధికారులు అక్రమ తాబేళ్ల రవాణాను పలుమార్లు అడ్డుకున్నారు.

నిఘా ముమ్మరం చేశాం



తాబేళ్ళ రవాణా నేరం. కొల్లేరు పరివాహక ప్రాంతాలు కాకుండా బయట ప్రాంతాల్లో వీటి రవాణా జరిగితే టెరిటోరియల్ ఫారెస్టు అధికారులు కేసులు నమోదు చేస్తారు. కొల్లేరు పరివాహక ప్రాంతాల్లో రవాణా చేస్తే అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించాలి

– కేపీ రామలింగాచార్యులు, ఫారెస్టు రేంజర్, కైకలూరు


కొల్లేరు నుంచి స్మగ్లింగ్ చేస్తున్న నల్ల చిప్ప తాబేళ్లు

అంతరించిపోతున్న నల్లచిప్ప తాబేలు

ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్(ఐయూసీఎన్) 2002లోనే అంతరించిపోతున్నా జాతులలో నల్లచిప్ప తాబేలును చేర్చింది. ఇండియాలో అసోం, త్రిపుర, బంగ్లాదేశ్‌లోని చిట్టగాంగ్ తదితర ప్రాంతాల్లో ఇవి ఎక్కువగా ఉన్నాయి. ఇవి 31 అంగుళాల వెడల్పు, 28 అంగుళాల పొడవు పెరుగుతాయి. సాధారణంగా 38 గుడ్లు పెడతాయి. మొక్కలు, చేపలు, పురుగులతో పాటు నీటిలో హనికర క్రిములను తింటాయి.

అంతరించిపోతున్న తాబేలు జాతిని అన్ని దేశాలు షెడ్యూల్ -1 కేటగిరిలో చేర్చాయి. వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం తాబేలును వేటాడడం, రవాణా చేయడం నేరం. ఏడేళ్ల కారగార శిక్ష విధించవచ్చు. అటవీ శాఖ చట్టాల సెక్షన్లు 27, 29, 31బీల ప్రకారం కేసులు నమోదు చేయొచ్చు.

వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి

తణుకు అర్బన్: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ప్రచార బోర్డును ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇరగవరం కాలనీ శివారు ప్రాంతంలో శనివారం అర్ధరాత్రి జరిగిన ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం పసలపూడి గ్రామానికి చెందిన కత్తుల చక్రధరరావు అలియాస్ చక్రి (32) ఉపాధి నిమిత్తం కొన్నేళ్లుగా కువైట్‌లో ఉంటూ 20 రోజుల క్రితం సొంతూరుకు వచ్చాడు. తూర్పు విప్పర్రులోని అత్తవారింటి నుంచి ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఇరగరం రోడ్డులో వాహనం అదుపుతప్పి బోర్డును ఢీకొట్టగా తలకు తీవ్రగాయమై ఘటనా ప్రాంతంలోనే కన్నుమూశాడు.

బంగారు ఆభరణాల చోరీ


చోరీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రూరల్ సీఐ జగదీశ్వరరావు

ఆకివీడు: ఇంట్లో దొంగలు చొరబడి తొమ్మిది తులాల బంగారు ఆభరణాలు దోచుకుపోయిన ఘటన కాకరపర్తి చెంచయ్య వీధిలో జరిగింది. ఈ నెల 7న ఉదయం ఇంటికి తాళం వేసి నర్సాపురంలో వివాహ వేడుకకు విశ్రాంతి ఉపాధ్యాయుడు పులవర్తి వెంకటేశ్వరరావు కుటుంబం వెళ్లింది. ఆదివారం తిరిగి వచ్చే సరికి తాళాలు బద్దలుకొట్టి ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూరల్ సీఐ జగదీశ్వరరావు, సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చి దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. 9 తులాల బంగారం చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేశారని ఏఎస్ఐ బీ.సత్యనారాయణ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

తణుకు అర్బన్: తణుకు పైడిపర్రు రైల్వే ఓవర్ బ్రిడ్జి ప్రాంతంలో ఆర్టీసీ బస్సు కిందపడి తీవ్రగాయాల పాలైన తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన యార్లగడ్డ రవి (50) శనివారం రాత్రి రాజమండ్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. తణుకు కోర్టులో గుమస్తాగా విధులు నిర్వర్తిస్తున్న రవి ఈనెల 9వ తేదీన ఉదయం పైడిపర్రు ప్రాంతంలో ఏలూరుకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో కాలు నుజ్జునుజ్జయ్యింది. రాజమండ్రి ప్రభుత్వ ఆస్పత్రిలో పంచానామా అనంతరం పోస్టు మార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు మృతదేహాన్ని అప్పగించినట్లు రూరల్ ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

జంగారెడ్డిగూడెంలో చోరీ

జంగారెడ్డిగూడెం: పట్టణంలో గుండాబత్తుల వారి వీధిలో ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న డి.శిరీష ఇంట్లో చోరీ జరిగింది. ఈనెల 8న ఇంటికి తాళం వేసి స్వగ్రామమైన టి.నరసాపురం మండలం ప్రకాశ్‌నగర్ వెళ్లింది. ఆదివారం ఉదయం వచ్చి చూసేసరికి ఇంటి తలుపులు పగలకొట్టి ఉన్నాయి. అల్మరాలో ఉంచిన బంగారం ఉగరం, రూ.3 వేల నగదు చోరీకి గురయ్యాయి.

వృద్ధుడి ఆత్మహత్య

ఏలూరు టౌన్: అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపానికి గురైన వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు రూరల్ రంగారావు కాలనీకి చెందిన పిల్లా తాతారావు (67) రెండేళ్ళుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మనస్థాపానికి గురై శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆరోగ్య పరిస్థితి విషమించి ఆదివారం మృతిచెందాడు.

దోమ తెరలు ఎక్కడ?

- మన్యంలో విజృంభిస్తున్న మలేరియా జ్వరాలు
- గతేడాది కంటే అధికంగా పెరుగుతున్న కేసులు
- మొక్కుబడిగా నియంత్రణ చర్యలు
- గత ఏడాది నుంచి పంపిణీ చేయని దోమ తెరలు


గతంలో ఇచ్చిన దోమ తెరలనే వినియోగిస్తున్న గిరిజనులు

బుట్టాయగూడెం: జిల్లాలోని మన్య ప్రాంతంలో మలేరియా జ్వరాలు విజృంభిస్తున్నా కూటమి ప్రభుత్వంలో ఏమాత్రం చలనం కనిపించడంలేదని గిరిజన సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. సీజనల్ జ్వరాలతో పాటు మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ జ్వరాలు స్వైరవిహారం చేస్తున్నాయి. దోమల నియంత్రణలో కీలకమైన దోమ తెరల పంపిణీని గతేడాది గాలికి వదిలేసిన ప్రభుత్వం ఈ ఏడాది కూడా అదే ధోరణిలో వ్యవహరిస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది అత్యధికంగా మలేరియా కేసులు నమోదవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

గత ఏడాది జనవరి నుంచి ఆగస్టు నెలాఖరు నాటికి కేవలం 93 మలేరియా కేసులు నమోదు కాగా ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు 10 నాటికి సుమారు 570 కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. గత ఏడాది కంటే ఈ ఏడాది 477 కేసులు అధికంగా నమోదయ్యాయి. గిరిజన గ్రామాల్లో దోమల నివారణకు ప్రస్తుతం మూడో దశలో మలాథియన్ స్ప్రేయింగ్ పనులు జరుగుతున్నటు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే మలేరియా కేసులు అధికంగా పెరుగుతునే ఉన్నాయి. దోమలను నివారించాలంటే దోమ తెరలతోనే సాధ్యమని ఈ ప్రాంత వాసులు చెబుతున్నారు.

జిల్లాలో మలేరియా సమస్యాత్మక గ్రామాలు – 153
బుట్టాయగూడెం, పోలవరం, జీలుగుమిల్లి మండలాల్లో – 117
వీలీన మండలాలైన కుక్కునూరు, వేలేరుపాగు మండలాల్లో – 36 గ్రామాలు

వైఎస్సార్‌సీపీ పాలనలో దోమతెరల పంపిణీ

పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాల్లో మలేరియా నియంత్రణకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో కృషి చేసింది. గ్రామాల్లో దోమలను అరికట్టేందుకు అధికారులు పగడ్బందీగా చర్యలు చేపట్టారు. 2021లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న నేషనల్ వెక్టర్ బోర్న్ డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రాం సంస్థ (ఎన్‌వీబీడీసీపీ) నుంచి సుమారు 2 లక్షల 50 వేల దోమ తెరలను రప్పించి బుట్టాయగూడెం, పోలవరం, జీలుగుమిల్లి, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో ఉన్న గిరిజన గ్రామాల్లో ప్రజలకు పంపిణీ చేశారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు దోమ తెరలు పంపిణీ చేశారు. దోమ తెరల కాలపరిమితి మూడేళ్ల లోపు కావడంతో మళ్లీ 2024 జనవరిలో దోమ తెరల కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ప్రతిపాదనలు పంపింది.

కానరాని దోమ తెరల పంపిణీ

కూటమి ప్రభుత్వం దోమ తెరల పంపిణీపై ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. గత ఏడాది దోమ తెరల పంపిణీ జరగలేదు. ఈ ఏడాది వేసవిలో వర్షాలు కురవడం, వర్షా కాలంలో తీవ్రమైన ఎండలు, వేడి గాలులు ఉక్కపోతలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. సీజనల్ జర్వాలతో పాటు మలేరియా జ్వరాలు అధికంగా ఉన్నాయి. ఇప్పటికైన ప్రభుత్వం దోమ తెరలు పంపిణీ చేసి మలేరియా జ్వరాల నివారణకు కృషి చేయాలని గిరిజన సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

పాత తెరలు చిరిగిపోయాయి



గత రెండు సంవత్సరాల నుంచి మాకు దోమ తెరలు పంపిణీ చేయలేదు. గతంలో ఇచ్చిన దోమ తెరలు చిరిగిపోయాయి. మా గ్రామాల్లో దోమలు విపరీతంగా ఉన్నాయి. దోమ తెరల కోసం ఎదురు చూస్తున్నాం. ప్రభుత్వం దోమ తెరలు పంపిణీ చేయాలి.

నడపల ముక్కారెడ్డి, గడ్డపల్లి, పోలవరం మండలం

ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు



కూటమి ప్రభుత్వానికి దోమ తెరల పంపిణీపై చిత్తశుద్ధి ఉన్నట్లు కనిపించడం లేదు. గతేడాది పంపిణీ చేయలేదు. ఈ ఏడాది పంపిణీ చేస్తారో లేదో అనే అనుమానం వస్తుంది. ప్రస్తుతం గిరిజన గ్రామాల్లో మలేరియా జ్వరాలు విజృంభిస్తున్నాయి.

కారం రాఘవ, ఏపీకేఎంఎస్ నాయకుడు, అలివేరు, బుట్టాయగూడెం మండలం

ప్రత్యేక దృష్టి పెట్టాం



జిల్లాలో మలేరియా నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాం. దీని కోసం సుమారు 2 లక్షల 50 వేలు దోమ తెరలు అవసరమని ప్రతిపాదనలు పంపించారు. అవి వచ్చిన వెంటనే మలేరియా సమస్యాత్మక గ్రామాల్లో పంపిణీ చేస్తాం.

ఎన్ఎస్ఎస్ ప్రసాద్, జిల్లా మలేరియాధికారి, కేఆర్ పురం, బుట్టాయగూడెం మండలం

వాణిజ్య ఒప్పందాలతో వ్యవసాయానికి తీవ్ర నష్టం



సమావేశంలో పాల్గొన్న రైతు సంఘాలు, కార్మిక సంఘాల జిల్లా నాయకులు

ఏలూరు (టూటౌన్): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చేసుకుంటున్న విదేశీ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో దేశ వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం జరుగుతున్నదని రైతు సంఘాలు, కార్మిక సంఘాల నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఏలూరు అన్నే భవనంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ జిల్లా కమిటీ, కార్మిక సంఘాల జిల్లా సమన్వయ కమిటీ సంయుక్త సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ ఈ నెల 13న సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల సమన్వయ కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు ఏలూరులో నిర్వహించే క్విట్ కార్పొరేట్స్ నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహనరావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస డాంగే, జిల్లా నాయకులు పుప్పాల కన్నబాబు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి. రామకృష్ణ పాల్గొన్నారు.

హుండీ దొంగతనం కేసులో నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రజనీ కుమార్

నిడమర్రు: గత నెల 26న పెదనింద్రకొలను, పత్తేపురం గ్రామాల్లో దేవాలయాల్లో హుండీలు బద్దలుగొట్టి నగదు దోచుకున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు నిడమర్రు సీఐ ఎస్.రజనీ కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉండి మండలం ఆరేడు గ్రామానికి చెందిన ప్రత్తిపాటి మహిమ కుమార్, గణపవరానికి చెందిన యంబల జోషి, పాలకొల్లు మండలం లంకలకోడేరుకు చెందిన మరొకరిని హుండీ దొంగతనం కేసులో నిందితులుగా గుర్తించినట్లు తెలిపారు. సీసీ కెమెరాల సాయంతో నిందితులను అరెస్ట్ చేసామన్నారు. వీరు గతంలో ద్వారకా తిరుమల్లో షాపు దొంగతనంలో, దెందులూరు పోలీస్ స్టేషన్ పరిధిలో హుండీ దొంగతనం కేసులో నిందితులుగా ఉన్నట్లు తెలిపారు. వీరిని ఆదివారం సాయంత్రం అరెస్ట్ చేసి బైక్, రూ.5,721 నగదు, రెండు రాడ్లు స్వాధీనం చేసుకున్నామని, సోమవారం తాడేపల్లిగూడెం కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

పశువుల్లో ఈనిక సమస్యలు



జంగారెడ్డిగూడెం: ఆవులు, గేదెల్లో ఈనికకు ముందు, సమయంలో, తర్వాత జరిగే వ్యాధులు పశువుల ఆరోగ్యం, పాల ఉత్పత్తి, రోగనిరోధక శక్తిని ప్రభావితం చేస్తాయి. ముందుగా గుర్తించడం, నివారించడం, తగిన చికిత్స ఇవ్వడం ద్వారా పశువుల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. పశువుల రైతులకు ఈ వ్యాధులను ఎలా నివారించాలో, ఎలా నిర్వహించాలో పశువైద్యాధికారి బీఆర్ శ్రీనివాసన్ వివరించారు.



ఈనికకు ముందు వ్యాధులు

- **పాల జ్వరం:** పాల జ్వరం అనేది రక్తంలో కాల్షియం స్థాయి తగ్గడంతో కలిగే వ్యాధి. ఇది సాధారణంగా ఆవులు, గెదెలలో ఈనికకు ముందు లేదా తరువాత కనిపిస్తుంది.

లక్షణాలు: కాళ్ళలో బలహీనత, నిలబడలేకపోవడం, చల్లని పాదాలు, తీవ్రమైన పరిస్థితిలో పశువు పడిపోయే ప్రమాదం ఉంటుంది.

చికిత్స: వెంటనే కాల్షియం ఐవీ చుక్కల రూపంలో ఇవ్వాలి. పశువైద్యుడి సలహా మేరకు అధిక ప్రమాదం ఉన్న పశువులకు ముందస్తుగా కాల్షియం అందించాలి.

నివారణ: ఆహారంలో సరైన పరిమాణంలో కాల్షియం, ఫాస్ఫరస్ ఉండేలా చూసుకోవాలి. ఈనికకు ముందు కాల్షియం సప్లిమెంట్స్ ఇవ్వడం వల్ల కాల్షియం స్థాయిలను కాపాడుకోవచ్చు.

- **కీటోసిస్:** కీటోసిస్ అనేది పశువు శక్తి లోటుతో కలిగే వ్యాధి, ఇది ఈనికకు ముందు ఎక్కువగా జరుగుతుంది.

లక్షణాలు: పాల ఉత్పత్తి తగ్గిపోవడం, ఆకలి తగ్గడం, బరువు తగ్గడం. మూత్రంలో ఎసిటోన్ వాసన

చికిత్స: ప్రొపైలీన్ గ్లైకాల్ రూపంలో ఇచ్చి గ్లూకోజ్ స్థాయిని పెంచాలి.

నివారణ: ముఖ్యంగా అధిక పాల ఉత్పత్తి చేసే పశువులకు సమతుల్య ఆహారం అందించాలి. శరీరంలో తగిన శక్తి నిల్వల కోసం సరైన ఆహారం ఇవ్వాలి.

ఈనిక సమయంలో వ్యాధులు

- **కష్ట సాధ్యం:**

కష్టసాధ్యమైన ఈనిక సమయంలో..

లక్షణాలు: సుదీర్ఘ ఈనిక సమయంలో పిల్లలు బయటకు రాకపోవడం.

చికిత్స: అవసరమైనపుడు ఈనికకు సహాయం చేయాలి. తీవ్ర పరిస్థితుల్లో సిజేరియన్ చేయవచ్చు.

నివారణ: పెద్ద పిల్లలను ఈనే అవకాశం ఉన్న అవులకు తగిన ఆహారం, శ్రద్ధ తీసుకోవాలి. సరైన సమయానికి పశువైద్యుడి సలహాలు తీసుకోవాలి.

- **గర్భపాతాల నిలుపు**

గర్భపాతం 12 గంటలలోపు బయటకు రాకపోతే ఇది ఒక సమస్యగా మారుతుంది.

లక్షణాలు: జనన మార్గం నుండి చెడిపోయిన వాసన రావడం

చికిత్స: పశువైద్యుడు సూచించిన విధంగా యాంటీ బయోటిక్స్ ఇవ్వాలి.

నివారణ: సరైన పోషకాహారం ఇవ్వడం, ముఖ్యంగా విటమిన్-ఇ, సెలీనియం తగిన మోతాదులో ఉండాలి.

ఈనిక తరువాత వ్యాధులు

- **మెట్రిటిస్:** ఇది ఒక బాక్టీరియా ఇన్ఫెక్షన్. సాధారణంగా కష్టపసవం లేదా గర్భపాతం తర్వాత కలుగుతుంది.

లక్షణాలు: చెడు వాసన, జ్వరం, ఆకలి తగ్గడం.

చికిత్స: యాంటీబయోటిక్స్, పశువైద్యుడి సూచనలతో సరైన చికిత్స చేయాలి.

నివారణ: ఈనిక సమయంలో పరిశుభ్రత పాటించడం.

- **మస్టిటిస్:** మస్టిటిస్ అనేది పాలు ఉత్పత్తి చేసే గ్రంథులలో ఇన్ఫెక్షన్ ద్వారా కలిగే వ్యాధి.

లక్షణాలు: ఉబ్బిన, వేడిగా ఉండే పొట్ట, మరియు పాలు అసాధారణంగా ఉండటం (గడ్డలు, రక్తం).

చికిత్స: పశువైద్యుని సూచన మేరకు యాంటీబయోటిక్స్ ఇవ్వాలి.

నివారణ: పాల యంత్రాల పరిశుభ్రత, పశువుల శుభ్రతతో పాటించాలి.

సమతుల ఆహారాన్ని అందించాలి



ఈనికకు ముందు, సమయంలో, తర్వాత వ్యాధులు పశువుల ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి. ఇవి నివారించడం ద్వారా పశువుల పాల ఉత్పత్తిని పెంచి, వాటి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ముఖ్యంగా సమతుల ఆహారం, ముఖ్యంగా ఈనికకు ముందు, తర్వాత అందించాలి. పశువులు ఉండే వాతావరణం పరిశుభ్రంగా ఉంచాలి. పశువైద్యుడి పర్యవేక్షణలో వ్యాధులు గుర్తించడం, చికిత్స చేయడం చేయించాలి.

– డా. బి. ఆర్. శ్రీనివాసన్, పశు వైద్యాధికారి,

క్లుప్తంగా

ఇంటింటికీ ఉచిత వైద్యం



వృద్ధురాలికి వైద్యసేవలందిస్తున్న డాక్టర్ హుస్సేన్ అహ్మద్

తణుకు అర్బన్: సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికీ ఉచిత వైద్య సేవలు అందించారు. తణుకు, పైడిపర్రు, మండపాక ప్రాంతాల్లో ఇంటికే పరిమితమైన వృద్ధులకు ఇళ్లకు వెళ్లి వైద్య సేవలందించారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, సీనియర్ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య ప్రత్యేక వాహనం ద్వారా 10 మంది వృద్ధుల ఇళ్లకు వెళ్లి వైద్య సేవలందించారు. అసోసియేషన్ సభ్యులు యడ్లపల్లి శివప్రసాద్ ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేసినట్లు అధ్యక్షుడు అల్లూరి కరుణాకర చౌదరి తెలిపారు. ఉచిత వైద్య సేవలు అవసరమైన వారు 99853 43530, 90592 90717 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి అర్జి భాస్కరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్స్ సేవలు అభినందనీయం



వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్స్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. మెంబర్ షిప్ చైర్ పర్సన్, దాత వేగేశ్న రామరాజు ఆధ్వర్యంలో ఆదివారం పడాల జీవన సంధ్య వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. పేరిచర్ల ఫౌండేషన్ చైర్మన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు పర్యవేక్షించారు. లార్డ్స్ ఆఫ్ లైఫ్ చిన్నారులకు పౌష్టికాహారం అందజేశారు. భవిత దివ్యాంగుల సెంటర్‌లో స్టేషనరీ ఇచ్చారు. చెన్నారెడ్డి సతీష్, డైమండ్స్ సభ్యులు జొన్నల సతీష్ కుమార్, కోటి విజయ్‌కిషోర్, ఆకుల సతీష్, కన్నాజీ శ్రీనివాస్, ఏడుకొండలు, కె.సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరుగొలనులో 'రంగా' విగ్రహావిష్కరణ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుగొలనులో నూతనంగా ఏర్పాటు చేసిన వంగవీటి మోహన రంగ విగ్రహాన్ని ఆదివారం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడిన మహనీయుడు వంగవీటి మోహనరంగా అని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ పీతల బుచ్చిబాబు, అడపా ప్రసాద్, నూకల బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్డీఓ దాసి రాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేవారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులు ఉదయం 10.30 గంటలు నుంచి అందించాలని కోరారు.

పేకాట స్థావరంపై దాడి

నరసాపురం రూరల్: మండలంలోని సరిపల్లి గ్రామ శివారు ప్రాంతంలో ఆదివారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసినట్లు నరసాపురం రూరల్ ఎస్ఐ టి.వెంకట సురేష్ తెలిపారు. ఈ దాడిలో ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.8700నగదు, పేక ముక్కలు, 3 ఫోన్లు, 3 మోటార్ సైకిల్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు

గంగాలమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగాలమ్మ

నరసాపురం రూరల్: మండలంలోని ఎల్బీచర్ల గ్రామంలో ఉన్న శ్రీ గంగాలమ్మ వారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసం ఆదివారం కావడంతో పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి మొక్కులు చెల్లించి నైవేద్యాలు సమర్పించారు.

చెత్త సేకరణలో పురపాలిక చిత్తు

- ప్రతి ఆదివారం పరిస్థితి దయనీయం
- పట్టించుకునే నాథుడు కరువు
- దుర్గంధభరితంగా తణుకు పట్టణం
- చెత్తతో స్వాగతం పలుకుతున్న రోడ్లు



టీటీడీ కల్యాణ మండపం గేటు ముందు పేరుకుపోయిన చెత్త



కట్టుమూరి వారి వీధిలో తిష్ట వేసిన చెత్త



పిండిమర్ల వీధిలో రోడ్డుపై మేటలా పేరుకుపోయిన చెత్త



జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాల వెనుక గేటు ప్రాంతంలో రోడ్డుపైనే చెత్త

తణుకు అర్బన్: ప్రతి రోజూ తణుకు పట్టణంలోని చెత్త సేకరణలో తణుకు పురపాలక సంఘం చిత్తయిందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఆదివారం తణుకు రావొద్దని, తణుకు వాసులు ఇళ్లలోంచి బయటకు రావొద్దన్నట్లుగా రహదారులు దుర్గంధంగా మారుతున్నాయి. ఏ రహదారిలోకి వెళ్లినా చెత్త కుప్పల తాకిడికి దుర్వాసనతో నిండిపోతున్నాయని తణుకు వాసులు గగ్గోలు పెడుతున్నారు. గతంలో ఎంతో పరిశుభ్రంగా ఉండే తణుకు మున్సిపాలిటీని ఇలా దుర్గంధభరితంగా తయారు చేశారని ప్రజలు విరుచుకు పడుతున్నారు. ఆదివారం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు సెలవు కావడంతో పూర్తి స్థాయిలో చెత్త సేకరణ చేయలేని పరిస్థితి ఏర్పడిందని అయితే గతంలో ఈ సమస్య లేదని మాత్రం తణుకు వాసులు చెబుతున్నారు. ఏ వీధి చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తుండడంతో దుర్వాసనతో అల్లాడుతున్నారు. తణుకు పురపాలక సంఘ పరిధిలోని 34 వార్డులకు సంబంధించి నిత్యం 50 టన్నులకు పైగా చెత్తను సేకరించి కంపోస్టుకు చేర్చాల్సి ఉంది. ఇందుకు సంబంధించి గతంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండానే కంపోస్టుకు వెళ్లిన చెత్త నేడు రహదారులపై ఎందుకు తిష్టవేయాల్సి వస్తుందని ప్రజానీకం ప్రశ్నిస్తున్నారు.

గతంలో 27 వాహనాల ద్వారా చెత్త నేరుగా కంపోస్టుకి తరలింపు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చెత్త సేకరణకు అత్యంత ప్రాధాన్యనిస్తూ ఇంటి నుంచి వచ్చే చెత్తను నేరుగా క్లాప్ వాహనాల ద్వారా కంపోస్టుకు తరలించేవారు. వాహనానికిఉన్న మైకులో చెత్త వాహనం వస్తుందంటూ తెలియజేస్తూ ప్రతి ఇంటి ముందూ ఆగి సిబ్బంది చెత్త సేకరించి వాహనంలో వేసేవారు. దీంతో ఏరోడ్డుపైనా చెత్త ఆనవాళ్లే కనిపించేవి కావని ప్రజానీకం చెబుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రాగానే ముందుగా డ్రైవర్ల వేతనాలు నిలిపివేసి ఆ తరువాత చెత్త వాహనాలను నిలిపివేసింది. సచివాలయానికి ఒకటి చొప్పు న 27 సచివాలయాలకు క్లాప్ వాహనసేవలు అందుబాటులోఉండేవి. కానీ నేడు ఆ వాహనాలను నిలిపివేసి పాత పద్ధతిలో తిరిగి రోడ్లపై చెత్త కుండీలను కూటమి ప్రభుత్వం ఏర్పాటుచేయడాన్ని ప్రజానీకం తీవ్రంగా విమర్శిస్తున్నారు. కొత్త సంస్కరణలను అందుబాటులోకి తీసుకొచ్చి మరింత మెరుగైన సేవలు అందించాల్సిన పరిస్థితుల్లో క్లాప్ వాహనాలకు మంగళంపాడి పాతవిధానంలో చెత్త కుండీలు ఏర్పాటుచేయడమేమిటని నిలదీసే పరిస్థితి తణుకులో నెలకొంది. పారిశుద్ధ్య విభాగ అధికారులు చెత్త సేకరణపై దృష్టి కేంద్రీకరించకపోవడం, క్లాప్ వాహనాలను తొలగించడంవంటి పరిణామాలతో వ్యాపార, వాణిజ్యపరంగా దినదినాభివృద్ధి చెంది పచ్చని పందిరిలాఉండే తణుకు ప్రాంతం నేడు పారిశుద్ధ్య సమస్యతో కునారిల్లుతోంది. ప్రతి రోజూ చెత్త సేకరణలో తణుకు పురపాలక సంఘం విఫలమవుతుండగా ఆదివారం మాత్రం పట్టణం మరింత దుర్గంధంగా మారుతుందని ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్టు



బెల్టు షాపు నిర్వాహకుడిని అరెస్టు చేసిన ఎక్సైజ్ పోలీసులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న సమాచారం మేరకు ఆదివారం ఒక కేసు నమోదు చేసి ముద్దాయిను అరెస్టు చేశారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఇ.స్వరాజ్యలక్ష్మి, సబ్ ఇన్‌స్పెక్టర్ మురళీ మోహన్, దొరబాబు, సిబ్బంది ఆధ్వర్యంలో స్టేషన్ పరిధిలో పలు ప్రదేశాల్లో దాడులు నిర్వహించారు. మండలంలోని జగ్గన్నపేట గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 7 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు స్టేషన్ అధికారులు వెల్లడించారు.

చెస్ విజేత బాలశ్రీ కార్తీక్‌కు అభినందనలు



తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీ స్టేట్ ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ వారిచే రాజమండ్రిలో ఆదివారం చెస్ కాంపిటీషన్ నిర్వహించారు. ఇందులో భారతీయ విద్యా భవన్స్ విద్యార్థి, తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన క్రీడాకారుడు వంగపండు బాలశ్రీ కార్తీక్ అండర్-12 బాలురు విభాగంలో స్టేట్ సెకండ్ ర్యాంక్ సాధించాడు. భారతీయ విద్యా భవన్స్ యాజమాన్యం, చెస్ కోచ్ ప్రదీప్‌లు అభినందించారు. కార్తీక్ మాట్లాడుతూ నేషనల్ స్థాయికి అర్హత సాధించేందుకు, గ్రాండ్ మాస్టర్ స్థాయికి ఎదిగేందుకు కృషి చేస్తానని చెప్పాడు.

సూపర్ సిక్స్ పేరుతో చంద్రబాబు ఘరానా మోసం



కరపత్రాలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకురాలు జానకి

తణుకు అర్బన్: సూపర్ సిక్స్ పేరుతో చంద్రబాబు ప్రజలను ఘరానాగా మోసం చేసి అధికారాన్ని చేజిక్కించుకున్నారని వైఎస్సార్ సీపీ తణుకు మండల మహిళాధ్యక్షురాలు ఉండవల్లి జానకి అన్నారు. తణుకు మండలం మండపాక శివారులోని ఎర్రనీలిగుంటలో ఆదివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చంద్రబాబుకు ఎన్నికల ముందు ప్రజలను మభ్యపెట్టే ధోరణితో మాట్లాడి మోసం చేసే గుణం ఉందని ప్రజలకు తెలిసికూడా మోసపోతూనే ఉన్నారన్నారు. ముఖ్యంగా ఇంటి గుమ్మంలోకివచ్చే రేషన్ వాహనాలను నిలిపి వేసి పాత రోజుల్లో మాదిరిగా రేషన్ దుకాణాలకు వెళ్లి తెచ్చుకునే విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారని విమర్శించారు. వలంటీర్ల సేవలకు మంగళం పాడి పేదలను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని, నేడు ఏ కార్యాలయానికి వెళ్లినా పనులు అవ్వక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉండవల్లి సురేష్, కంకటాల గోపాలకృష్ణ, కంకటాల సత్యనారాయణ, గూడూరి శ్రీనివాస్, పితాని పల్లంశెట్టి, కంకటాల గంగాధరరావు, కంకటాల ప్రసాద్, కంకటాల సూర్యనారాయణ, పితాని రాంబాబు, గూడూరి సత్యనారాయణ, పాలపర్తి అఖిల్ పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న జొన్నాడ శ్రీనివాస్

తాడేపల్లిగూడెం (టీఓసీ): రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఏపీ రజక చైతన్య సేవా సంస్థ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జొన్నాడ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ ఆఫీస్‌లో ఆదివారం రజక చైతన్య సేవా సంస్థ నియోజకవర్గం సమావేశం నిర్వహించారు. జొన్నాడ శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీ-ఏలో ఉన్న రజకులను ఎస్సీ జాబితాలో చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం శాసన సభలో తీర్మానం చేసి వెంటనే కేంద్రానికి పంపించాలని డిమాండ్ చేశారు. విద్యా, ఉద్యోగ, ఆర్థిక రంగాల్లో రజకులు వెనుకబడి ఉన్నారని, హక్కుల సాధనకు రజకులు ఐక్య పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ అధ్యక్షులు బోగెల్లి రాంబాబు అధ్యక్షత వహించారు. సమావేశంలో రూరల్ మండల కమిటీ, పట్టణ కమిటీలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. పట్టణ అధ్యక్షుడిగా నారాయణపురపు నరసింహరావు, ఉపాధ్యక్షుడిగా సోమవరపు రాము, సెక్రటరీగా కట్టుంగ నరసింహం, జాయింట్ సెక్రటరీగా మానేపల్లి సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కోటి చుక్కల అవతారం, కోశాధికారిగా మడిచిర్ల సుబ్బారావులు ఎన్నికయ్యారు. రూరల్ మండల కమిటీ అధ్యక్షులుగా పోలవరపు భీమ సతీష్, ఉపాధ్యక్షుడిగా గుంటుపల్లి సత్యనారాయణ, సెక్రటరీగా తీపర్తి నాగరాజు, కోశాధికారిగా పంగిడి ఏడుకొండలు ఎన్నికయ్యారు.

అసౌకర్యాల నడుమ వారపు సంత

పట్టించుకోవాలని కోరుతున్న ప్రజలు



వారపు సంతలో వర్షం కారణంగా బురదగా మారిన రహదారిపై సాగిస్తున్న వ్యాపారాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని వారపు సంతకు ఘన చరిత్ర ఉంది. ఇక్కడ ఆదివారం నిర్వహించే వారపు సంతలో సుమారు పది కోట్లకు పైనే వ్యాపార లావాదేవీలు జరుగుతాయి. ఇక్కడి నుంచే ఉల్లిపాయలు, వెల్లులి, దేశంలోని పలు రాష్ట్రాలకు సరఫరా అవుతాయి. కూరగాయలతో పాటు ఎండు చేపలు, మాంసం దుకాణాలు, చింత పండు, బెల్లం, పండ్లు తదితర వస్తువులు అమ్మకాలు జోరుగా సాగుతాయి. ఇంతటి ఘన చరిత్ర కలిగిన వారపు సంతలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో అమ్మకందారులు, వినియోగదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉంటే ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా సంత మార్కెట్‌లో అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. అపారిశుద్ధ్యంతో మార్కెట్ చిత్తడిగా మారింది.

మార్కెట్ బురదమయం

మార్కెట్‌లో మట్టి రోడ్లు కావడంతో ఎక్కడ చూసినా బురదగా మారింది. ఈ ప్రాంతాల్లోనే వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నారు. పలు చోట్ల జారుడు మట్టి కారణంగా ఎప్పుడు ఎవరు జారి పడతారో తెలియకుండా ఉంది. ఉదయం సమయంలో మార్కెట్‌లో అరిటి గెలల పాట జరగడంతో అక్కడి వ్యర్థాలను ప్రధాన రహదారి బైపాస్ రోడ్డుపై పారేశారు. వ్యాపార స్థలాల్లోనే అనేక ప్రాంతాలలో వ్యర్థాలు కనిపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాలలో చెత్తాచెదారాలతో పాటు దుర్వాసన వెదజల్లుతున్నాయి. కొన్ని చోట్ల నడిచేందుకు కూడా వీలు లేకుండా వ్యర్థాలు, బురదమయంగా మారిన పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా సంబంధిత అధికారులు స్పందించి, వారపు సంత సజావుగా సాగేందుకు అనుకూలమైన పరిస్థితులు కల్పించాలని, అపారిశుద్ధ్య పరిస్థితులను తొలగించాలని వ్యాపారస్తులు, ప్రజలు, వినియోగదారులు కోరుతున్నారు. ఇదిలా ఉంటే వర్షం, వాతావరణం ప్రతికూల పరిస్థితుల కారణంగా వారపు సంత మందకొడిగా సాగింది. వినియోగదారులు మార్కెట్‌కు రాకపోవడంతో వ్యాపారస్తులు కొంత మేర ఇబ్బందులు పడ్డారు.



మార్కెట్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం



బైపాస్ రోడ్డుపై పడేసిన అరటి గెలల చెత్త

ఈ రోడ్లు.. నరకానికి నకళ్లు

- నీటి మూటలైన పాలకుల మాటలు
- మెజార్టీ రోడ్ల మరమ్మతులకు నోచుకోని వైనం



ఏనుగువానిలంకలో అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారి



కాంబొట్లపాలెంలో బురదమయమైన రోడ్డు

యలమంచిలి: సంక్రాంతి నాటికి గతుకులు లేని రోడ్లు చూపిస్తామని ఎన్నికలకు ముందు ప్రగల్భాలు పలికిన కూటమి నేతలు అధికారం చేపట్టి ఏడాది గడచినా మాట నెలబెట్టుకోకపోవడంపై గ్రామీణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఉన్న రహదారుల్లో పాలకొల్లు-దొడ్డిపట్ల, మేడపాడు-ఏనుగువానిలంక ఆర్అండ్‌బీ రోడ్లు ప్రధానమైనవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాలకొల్లు-దొడ్డిపట్ల ఆర్అండ్‌బీ రోడ్డుకు అరకొరగానైనా మరమ్మతులు చేశారు. కానీ మేడపాడు-ఏనుగువానిలంక ఆర్అండ్‌బీ రోడ్డును మాత్రం అసలు పట్టించుకోలేదు. ఈ రోడ్డుకు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద, ఏనుగువానిలంక ఎంట్రన్స్‌లో పెద్ద పెద్ద గోతులు పడ్డాయి. ఈ ఏడాది కాలంలో ఈ రోడ్డుపై కనీసం తట్టడు గ్రావెల్ కూడా వేయలేదు. దీంతో ఈ రోడ్లపై ప్రయాణించడానికి ప్రజలు నరకయాతన పడుతున్నారు. పైగా ఈ రోడ్డుపై వేసవి కాలమంతా ట్రాక్టర్లు, లారీలపై విపరీతంగా మట్టి రవాణా చేశారు. ఆ సమయంలో రోడ్లపై పడిన మట్టిని తొలగించకపోవడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డంతా బురదమయమై ప్రయాణికులు, ముఖ్యంగా ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.

కాంబొట్లపాలెం రోడ్డు దుస్థితి

సీతమ్మచెరువు, కాంబొట్లపాలెం వెళ్లే రోడ్డు రెండు గ్రామాల ప్రజలకు నరకం చూపుతుంది. కొద్దిపాటి చినుకులు పడిన రోడ్డంతా బురదమయం అవుతుంది. కనీసం పాదచారులు కూడా నడవడానికి వీలులేనంతగా రోడ్డు మారుతుంది. దీంతో కాంబొట్లపాలెం గ్రామ ప్రజలు అదనపు దూరమైన గుంపర్రు మీదుగా ప్రయాణం సాగిస్తున్నారు. అయితే ఈ రోడ్డుపై సోషల్ మీడియాలో అనేక వీడియోలు వస్తున్నాయి. ఈ వీడియోలపై కూటమి నాయకులు స్పందిస్తూ గత ప్రభుత్వ వైఫల్యమని విమర్శించడాన్ని కాంబొట్లపాలెం ప్రజలు తప్పుపడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా ఆత్మస్తుతి పరనింద అన్నట్టు రోడ్డు వేయకుండా ఇంకా గత ప్రభుత్వం తప్పిదమని ఆరోపించడం సమంసజం కాదని, రోడ్డు వేసి ప్రజలకు మేలు చేయాలని కోరుతున్నారు. ఈ రోడ్డే కాకుండా మేడపాడు-పెనుమర్రు, కట్టుపాలెం-పెనుమర్రు రోడ్డులు కూడా అధ్వానంగా తయారయ్యాయి. పెనుమర్రు గ్రామ ప్రజలు తమ దైనందిన అవసరాల కోసం నిత్యం ఈ రెండు రోడ్డుల గుండానే బాహ్య ప్రపంచంలోనికి రావాలి. రెండు రోడ్డులు కూడా ధ్వంసం కావడంతో పెనుమర్రు గ్రామ ప్రజలు గ్రామం నుంచి బయటకు రావాలంటేనే హడలెత్తిపోతున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించి రోడ్డులు బాగు చేయాలని పెనుమర్రు గ్రామ ప్రజలు కోరుతున్నారు.

తట్ట గ్రావెల్ కూడా వేయలేదు



మా గ్రామం రావడానికి నరసాపురం వైపు నుంచి ఒకటి, చించినాడ వైపు నుంచి మరొకటి ఆర్అండ్‌బీ రోడ్డు ఉంది. రెండు రోడ్డులు కూడా అధ్వానంగా ఉన్నాయి. ప్రధానంగా చించినాడ వైపు రోడ్డుకు పెద్ద పెద్ద గోతులు పడ్డాయి. కొద్దిపాటి వర్షం కురిసిన వారం వరకు గోతుల్లో నీరు ఉండిపోతుంది. దీంతో వాహనాలపై వెళ్లే ప్రయాణికులంతా ప్రమాదాలకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయ్యింది. అయినా కొత్త రోడ్డు నిర్మాణం అటుంచి, కనీసం రోడ్డు మరమ్మతుకు ఇంత వరకు కనీసం తట్ట గ్రావెల్ కూడా వేయలేదు.

– పాలపర్తి సందీప్, ఏనుగువానిలంక

ఆంక్షలతో ఉచిత బస్సు పథకం సిగ్గుచేటు

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలతో కూడిన మహిళల ఉచిత బస్సు పథకం అమలు చేయడం సిగ్గుచేటని రాష్ట్ర వైఎస్సార్ సీపీ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కర్రా జయసరిత ప్రశ్నించారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాల్లో మహిళలకు ఉచిత బస్ పథకం ఒకటని అన్నారు. అయితే రాష్ట్రంలో 12 వేల బస్‌లు ఉంటే వాటిలో 6 వేల బస్‌ల్లో మాత్రమే ఉచిత బస్ ప్రయాణం ఉంటుందని చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఈ బస్సుల్లో కనీసం జిల్లా కూడా దాటని బస్సులు చాలా ఉన్నాయని, కొన్ని 30, 40 కి.మీ మించి వెళ్లని బస్సులు ఉన్నాయని అన్నారు. ఉచిత బస్ పథకం ద్వారా ఎందరో మహిళలు తీర్థ యాత్రలుచేయాలని ఆలోచనల్లో ఉన్నారని మరి అలాంటి వారి ఆశలు ఆడియాసలు అయినట్లేనని విమర్శించారు. సమావేశంలో నాయకులు పెచ్చెట్టి కృష్ణాజీ, జోగాడ ఉమామహేశ్వరరావు, దేవ రాజేష్, వీరా మల్లిఖార్జునుడు, మామిడిశెట్టి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.